సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

I

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023

క్లుప్తంగా

4న ఆత్మకూరులో 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 4వ తేదీన సోమవారం ఆత్మకూరులో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి తానే స్వయంగా అర్జీలు స్వీకరిస్తానని తెలియజేశారు. ప్రజలు తమ సమస్యలపై వినతులను ఇవ్వాలని సూచించారు. సంబంధిత డివిజన్ స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. నెల్లూరు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో సోమవారం జేసీ కూర్మనాథ్ జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.

ఆటో బోల్తా ఐదుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో ఆటో

పొదలకూరు : ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పట్టణ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద నెల్లూరు రోడ్డుపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. చేజర్లలో జరుగుతున్న ఇస్తేమాకు నెల్లూరు నుంచి రెండు ఆటోల్లో ముస్లిం యువకులు బయలుదేరారు. పొదలకూరు వద్దకు చేరుకోగానే ఒక ఆటో ముందువెళ్తున్న మరో ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్‌కే ఖలీల్, ఎండీ యూనస్, ఎస్డీ జమీర్, ఎస్‌కే అహ్మద్, ఎస్‌కే జమీర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పొదలకూరు సీహెచ్‌సీకు తరలించారు. వారిలో ఖలీల్ ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా డాక్టర్ శివకృష్ణ చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. అనంతరం క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు టైరు పంక్చర్ కావడంతో..

- కల్వర్టును ఢీకొని ముగ్గురికి స్వల్పగాయాలు



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

కొడవలూరు: ఆర్టీసీ బస్సు టైరు పంక్చరై తూమును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మండలంలోని రాచర్లపాడు గమేసా ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి కావలికి ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు బయలుదేరింది. ఈ క్రమంలో రాచర్లపాడు గమేసా ఫ్యాక్టరీ వద్ద వెళ్తుండగా టైరు పంక్చరైంది. దీంతో బస్సు అదుపుతప్పి ఎడమ వైపునున్న కల్వర్టు గోడను ఢీకొంది. ఆ సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులుండగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో కావలి ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో కావలికి పంపేలా చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న కొడవలూరు ఏఎస్సై గంధం ప్రసాద్, కానిస్టేబుల్ మస్తానయ్య ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రిన్సిపల్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపల్‌పై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కోటమిట్టకు చెందిన శ్రీహరి నగరంలోని రావూస్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం అతను ఎప్పటిలాగే కళాశాలకు వెళ్లాడు. ఈ క్రమంలో క్లాస్‌రూమ్‌లో అల్లరి చేస్తావా అంటూ ప్రిన్సిపల్ హరీష్‌కుమార్ శ్రీహరిని కొట్టాడు. గాయాలపాలైన అతడు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరాడు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:147
లేయర్ (లైవ్)	:105
బ్రాయిలర్ చికెన్	:250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:280
లేయర్ చికెన్	:178



నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 55
సన్నవి	: రూ. 35
పండ్లు	: రూ. 9

ఆప్యాయంగా పలకరించి.. పింఛన్ అందించి..



ఆత్మకూరు: నెల్లూరుపాళెం ఎస్సీ కాలనీలో బుజ్జమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనిత

అవ్వా బాగున్నావా..?, తాతా నీ ఆరోగ్యం ఎలా ఉంది?, అక్కా పిల్లలెలా ఉన్నారు? అంటూ పలకరించి పింఛన్లను అందజేశారు వలంటీర్లు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మొదలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారుజాము నుంచే వలంటీర్లు నగదు పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. ఎవరైనా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే అక్కడికి వెళ్లి పింఛన్లు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొడవలూరు: నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణయ్య వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ ముఖేష్



బుచ్చిరెడ్డిపాళెం: నెల్లూరులో కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శీనయ్య వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ భువనశ్రీ



మర్రిపాడు: డీసీపల్లిలో తెల్లవారుజామున కత్తి సుబ్బమ్మ చేత బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ రేవూరు సురేష్‌రెడ్డి



అల్లూరు: వడ్డిపాళెంలో బుజ్జయ్య చేత బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ అనిల్



నెల్లూరు: 36వ డివిజన్ ప్రాంతంలో అమీనాబీకు నగదు అందజేస్తున్న వలంటీర్ షబానా



పొదలకూరు: టీచర్స్ కాలనీలో యనమల ఓబులమ్మ చేత బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ సుధాకర్



నెల్లూరు సిటీ: 13వ డివిజన్‌లో నగదు అందజేస్తున్న కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున



గుడ్లూరులో పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ మాధురి

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమారెడ్డి తెలిపారు. మండలంలోని మైపాడు గ్రామంలో రెండోరోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చినట్లు తెలిపారు. దీంతో ఆయన్ను ప్రతి కుటుంబం ఆశీర్వదిస్తోందన్నారు. ప్రతినెలా వలంటీర్ల ద్వారా పింఛన్‌ను ఇంటికి పంపించి ఆదుకుంటున్నారని వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్‌కు సీఎంగా పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా లక్ష గడపలు పూర్తి కానున్నాయన్నారు. దీనికి సంబంధించి ఈనెల 3వ తేదీన మైపాడులో ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు శ్రీహరికోట జయలక్ష్మి, సర్పంచ్ సంగం వెంకయ్య, ఆక్వా సొసైటీ డైరెక్టర్ పామంజి నరసింహ, ఎంపీటీసీ కూనంగారి రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, శివాలయం చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, గంపల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సొమ్మును దోచిన వ్యక్తి చంద్రబాబు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: చంద్రబాబు నాయుడు అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజల సొమ్మును దోచేశాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కావలిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు బాబు ముడుపులు మింగేసి, కమీషన్లు కొట్టేసినట్లు ఆరోపించారు. ఐటీ నోటీసులు రాకుండా అడ్డుపడాలనుకున్నా కుదర్లేదన్నారు. గతంలో అమరావతి పేరుతో దోపిడీ చేశారన్నారు. మళ్లీ దోచుకునేందుకు అధికారం ఇవ్వాలని ప్రజలను అడుగుతున్నారన్నారు. అమరావతిలో చంద్రబాబు లూటీ చేసింది చాలా ఉందన్నారు. ఇప్పుడు రూ.118 కోట్లు మాత్రమే బయటకు వచ్చిందన్నారు. ఇలాంటి వ్యక్తికి అధికారం ఇస్తే ప్రజలను నిలువు దోపిడీ చేస్తాడన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, ష్యూరిటీ అంటూ బుకాయింపు మాటలు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. నారా లోకేశ్ తన తండ్రి అవినీతి గురించి చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎల్లో మీడియాలో చంద్రబాబు నల్లధనంపై, ఐటీ నోటీసుల గురించి సమగ్రంగా వార్తలు చూపించగలరా అన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, పల్లపు కొండలరావు, చల్లా లక్ష్మీరావు, యనమల మాల్యాద్రి, తన్నీరు ఆదినారాయణ, తన్నీరు మస్తాన్‌బాబు, దేవర్ల ఏడుకొండలు, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా పెన్షన్ లబ్ధిదారులు



నూతన పెన్షన్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తుండడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలానికి మంజూరైన నూతన పింఛన్లను స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచి అవ్వాతాతలు, వితంతువులకు అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి సుమారు వెయ్యి పెన్షన్లు మంజూరు కాగా అందులో ఎక్కువ భాగం ఉదయగిరి మండలంలో ఉన్నట్లు చెప్పారు. గత టీడీపీ పాలనలో ఎవరైనా పింఛన్‌దారుడు మృతిచెందితేనే కొత్త పెన్షన్ మంజూరయ్యేదన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను పల్లెలకు వెళ్లినప్పుడు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేసిందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలే వినయ్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎం.శాంతి, జి.తిరుపతి, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): రోడ్డు ప్రమాదంలో కాలు దెబ్బతిన్న విద్యార్థి కార్తీ హర్షవర్ధన్‌కు ప్యూర్ స్మైల్ సేవా సంస్థ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ మాట్లాడుతూ కోవూరు మండలం లేగుంటపాడు గ్రామానికి చెందిన కార్తీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడన్నారు. ఆర్థిక సమస్యలున్నట్లు తెలుసుకుని సాయం చేశామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ ప్రసాద్, లేగుంటపాడు పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 16.902 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 186 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,340
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,521
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,687
నవర (8 గ్రా) -	రూ.45,496

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.2 /26.7

శుక్రవారం గాలిలో తేమ 68 శాతం ఉంది. శనివారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఓట్ల తొలగింపుపై విచారణ



విచారణ చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

మనుబోలు: ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపుపై కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మనుబోలు మండలంలోని చెర్లోపల్లి, గోవిందరాజపురం, జట్ల కొండూరు, కొండూరుసత్రం, వెంకటాచలం మండలం ఇస్కపాళెం గ్రామాల్లో పర్యటించి తొలగించిన ఓట్లపై ఆరా తీశారు. రెండుచోట్ల ఉన్న ఓటు తొలగింపు, వేరేచోటుకు బదిలీ అయిన ఓటు, చనిపోయిన లేదా వేరే ప్రాంతానికి వెళ్లిపోయిన వారి ఓట్ల తొలగింపుపై వారి ఇళ్లకి వెళ్లి విచారణ చేపట్టారు. ఓటు తొలగించే ముందు వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారా లేదా అనే విషయంపై ఆరా తీశారు. ఆయన వెంట మనుబోలు, వెంకటాచలం మండలాల తహసీల్దార్లు శివకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, బీఎల్వోలు ఉన్నారు.

9న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

నెల్లూరు(టౌన్): పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఈ నెల 9న నెల్లూరుకు రానున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విజయవాడలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌ను కలిసి నెల్లూరులో జరిగే విద్యాసంబంధిత సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సదస్సులో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ట్యాబ్‌ల నిర్వహణ, టోఫెల్ పరీక్షపై వివరించనున్నట్లు తెలిపారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలు, వసతులు, బైజూస్ బోధన, డిజిటల్ తరగతులు, కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ, తదితర అంశాల అమలుపై ధన్యవాదాలు తెలిపారు.

జలయజ్ఞికుడు



నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి


- సాగు, తాగునీటి ప్రదాత
- సమగ్ర సోమశిలకు శ్రీకారం చుట్టిన మహనీయుడు
- జలాశయం సామర్థ్యం 78 టీఎంసీలకు పెంపు
- రైతులకు సంగం, పెన్నా బ్యారేజీల ఫలాలు
- మహానేత రాజన్నను మరువని సింహపురి

అన్నదాతల ఆత్మబంధువు.. ఆరోగ్యశ్రీతో అందరికీ ఆరోగ్యాన్ని అందించిన మహనీయుడు.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థులను విజయతీరాలకు చేర్చిన విద్యాదాత, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా సింహపురి అభివృద్ధిలో చెరగని సంతకం చేశారు. సమగ్ర సోమశిలతోపాటు సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టి అపర భగీరథుడిగా నిలిచారు. కృష్ణపట్నం పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రారంభించి అభివృద్ధికి బాటలు వేశారు. అలాగే జిల్లాల్లో పారిశ్రామిక ప్రగతికి కృషి చేశారు. సంక్షేమానికి సరికొత్త చిరునామాగా నిలిచిన రాజన్నను ఆయన వర్ధంతి సందర్భంగా ప్రజలు స్మరించుకుంటూ ఘన నివాళులర్పిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్ పేరు వింటేనే అన్నదాతే కాదు.. పుడమి తల్లి కూడా పులకిస్తుంది. వర్షపునీటిని ఒడిసిపట్టి సాగుకు మళ్లించిన అపర భగీరథుడు ఆయన. సింహపురి సిగలోని జలనిధి నుంచి జిల్లా నలుమూలలకు గంగమ్మను ఉరకలెత్తించారు. బంజరు భూములకు జలసిరులు అందించి బంగరు భూములుగా మార్చారు. జలయజ్ఞంతో డెల్టానే కాకుండా మెట్టలోనూ పచ్చని పైర్లు పండించిన పాలక కర్షకుడు రాజన్న. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక జిల్లాలో సాగునీటి రంగం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాగు, తాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిచ్చారు. రూ.వందల కోట్లు ఖర్చు చేసి జిల్లాను సుభిక్షం చేశారు. దశాబ్దం క్రితం ఆయన వేసిన సంగం, పెన్నా బ్యారేజీ బీజాలు ప్రస్తుతం ఫలాలు అందిస్తున్నాయి.

సింహపురిలో రాజన్న ముద్ర

- 2004 ఎన్నికలకు ముందు వైఎస్సార్ నిర్వహించిన పాదయాత్ర తర్వాత జిల్లాలో చేపట్టిన బస్సుయాత్రలోనూ అడుగడుగునా అన్నదాతలు తమ గోడును వెళ్లబోసుకున్నారు.
- రాజన్న ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాలో సాగునీటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు.
- జలయజ్ఞం ద్వారా రూ.వందల కోట్లతో సమగ్ర సోమశిల లక్ష్యంగా, పెన్నా, సంగం బ్యారేజీల నిర్మాణానికి అంకురార్పణ చేశారు.
- ప్రధానంగా 48 టీఎంసీలకే పరిమితమైన సోమశిల నీటి సామర్థ్యాన్ని రెండు దశల్లో 78 టీఎంసీల స్థాయికి తీసుకువచ్చారు.



సోమశిల జలాశయం (ఫైల్)

- సమగ్ర సోమశిలలో భాగంగా 104 కిలోమీటర్ల పొడవునా ఉత్తర కాలువను సోమశిల నుంచి ప్రకాశం జిల్లా కందుకూరు వరకు అభివృద్ధి చేసి నీటి ఔట్‌ఫ్లో సామర్థ్యాన్ని పెంచారు.
- సంగం, పెన్నా బ్యారేజీలపై దృష్టి సారించారు. 2006 మే 28న రూ.98 కోట్ల వ్యయంతో సంగం బ్యారేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ కుమారుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంగం బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీగా నామకరణం చేశారు.
- 800 మీటర్ల పొడవుతో ఈ బ్యారేజీని నిర్మించి 0.45 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతోపాటు డెల్టా స్థిరీకరణకు దోహదపడేలా సిద్ధం చేశారు.
- పెన్నా డెల్టాలో 2.47 లక్షల ఎకరాలకు, కనుపూరు కెనాల్ పరిధిలో 63వేల ఎకరాలకు, కావలి కెనాల్ 75 వేల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు రానున్న రోజుల్లో కొత్త ఆయకట్టు సాగులోకి రావడానికి దోహదపడుతుంది.
- ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో సాగుకు లబ్ధి చేకూరుతుంది.
- సోమశిల నుంచి 40 కిలోమీటర్ల దిగువ భాగంలో దీనిని నిర్మించడం ద్వారా కుడివైపున నెల్లూరు చెరువు, నెల్లూరు కాలువ, కనుపూరు కాలువ, కనిగిరి ప్రధాన కాలువ, దువ్వూరు కాలువ, కావలి కాలువ పరిధిలోని 3.85 లక్షల ఎకరాల సాగుకు ఇబ్బంది లేకుండా నీటి విడుదల జరుగుతోంది.
- అర టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ప్రత్యేకం.

పెన్నా బ్యారేజ్ ద్వారా..

- నెల్లూరు బ్యారేజ్ నిర్మాణంతో 5 మండలాల్లోని 72 గ్రామాల పరిధిలో 99,525 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.
- సర్వేపల్లికాలువ, జాఫర్‌సాహెబ్ కాలువల పరిధిలోని ఆయకట్టుకు పూర్తిగా నీరందుతుంది.
- నెల్లూరు నగర తాగునీటి అవసరాలు తీరుతాయి.
- నెల్లూరు–కోవూరు రహదారి మార్గంలోనూ పూర్తిగా ఇబ్బందులు తొలగుతాయి.
- 0.55 టీఎంసీల నీటి నిల్వ దీని ప్రత్యేకం.

భుజం తట్టి ప్రోత్సహించేవారు



డాక్టర్ వైఎస్సార్‌తో శివప్రసాద్‌రెడ్డి

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి ఒక్కరినీ భుజం తట్టి ప్రోత్సహించేవారు. ప్రధానంగా యువత దేశ భవిష్యత్‌ను నిర్దేశిస్తారని అనేవారు. 2004లో నేను కడప జియోన్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీఈటీ ట్రైనింగ్ చేశాను. ఆ సమయంలో వైఎస్సార్ కళాశాల యువతను పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడేవారు. ఆయన స్ఫూర్తితోనే నేను రాపూరు మండలం కండలేరు డ్యామ్‌లో వైఎస్సార్ ప్రారంభించిన గురుకుల కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేశాను. వైఎస్సార్‌తో గడిపిన క్షణాలను ఎన్నటికీ మరచిపోలేను.

– వాకాటి శివప్రసాద్‌రెడ్డి, పొదలకూరు.

రుణమాఫీ పొందాను



జీవీ సుబ్బారెడ్డి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన మేలు మరువలేం. రైతునైన నేను వైఎస్సార్ హయాంలో రూ.లక్ష రుణమాఫీ చేయడంతో కోలుకున్నాను. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నేను వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొంది కోలుకున్నాను. మహానేత ప్రజలకు చేసిన మేలును ఎన్నటికీ మరువలేం.

– జీవీ సుబ్బారెడ్డి, బొమ్మవరం అగ్రహారం, అనంతసాగరం మండలం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కౌలు రైతులు, దేవదాయ భూముల సాగుదారులకు రైతుభరోసా సాయం
- ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం ప్రసంగాన్ని వింటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి అవసరమైన అన్ని సేవలు అందిస్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కౌలు రైతులు, దేవదాయ భూముల సాగుదారులకు వైఎస్సార్ రైతుభరోసా సాయం, పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను రైతుల ఖాతాల్లో జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే కౌలు రైతులకు పెట్టుబడి సాయం, దేవదాయ భూముల సాగుదారులకు వైఎస్సార్ రైతుభరోసా సాయంగా రూ.109.74 కోట్లు, మే నెల నుంచి ఆగస్టు వరకు రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.11.01 కోట్లు మొత్తం రూ.120.75 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, కౌలు రైతులు హాజరయ్యారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

జిల్లాలో 1,192 మంది కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.89.40 లక్షల మెగా చెక్కును, జిల్లాలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన ఉద్యాన పంటల రైతులకు రూ.94 వేల మెగా చెక్కును కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్‌లతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే 18 మందికి డ్రోన్ పైలట్స్‌గా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పంటల బీమా రుసుమును ప్రభుత్వమే చెల్లించి రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



నేను ఇందుకూరుపేట గ్రామంలో రెండెకరాలు కౌలుకు తీసుకుని టమాటా పంట సాగు చేస్తున్నాను. వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా 5వ ఏడాది మొదటి విడత కింద రూ.7,500లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా ఖాతాల్లో జమ చేశారు. రైతులకు అండగా నిలుస్తున్న సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– షేక్ ఖాసీంసాహెబ్, కౌలు రైతు, ఇందుకూరుపేట

జగన్ననకు ప్రత్యేక ధన్యవాదాలు



నేను దొరువుపాళెం గ్రామంలో నిమ్మసాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం మే నెలలో వచ్చిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే సీజన్‌లో నష్టపరిహారం అందించి ఆదుకున్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు.

– చిరుమామిళ్ల బాబు, నిమ్మసాగు రైతు, దొరువుపాళెం, చేజర్ల మండలం

కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

- రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఇద్దరు మధ్యవర్తుల అరెస్ట్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ (నిల్చున్న వ్యక్తి)

కోవూరు: కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఇద్దరు మధ్యవర్తులను అదుపులోకి తీసుకొన్నారు. ఏసీబీ డీఎస్పీ మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కోవూరు పట్టణంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో చికెన్ దుకాణం నడుపుతున్న బుధవరపు రాజ్‌కుమార్‌కు చెందిన రెండు డాక్యుమెంట్‌లను రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడి మధ్యవర్తులైన వల్లెపు రాము, తిరువీధి రత్నంలను ఆశ్రయించారు. రాజ్‌కుమార్ తెచ్చిన రెండు లేఅవుట్‌లకు అప్రూవల్ లేదని, రూ.40 వేలు లంచం ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. అంత మొత్తాన్ని ఇవ్వలేని రాజ్‌కుమార్ ఏసీబీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఏసీబీ డీఎస్పీ మోహన్ తన సిబ్బందితో కలసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం మారు వేషంలో రెక్కీ నిర్వహించారు. ఫిర్యాదిదారు లంచం నగదు రూ.30 వేలు మధ్యవర్తులకు ఇచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు దాడి చేశారు. నగదుపై ఉన్న వేలి ముద్రలను పరిశీలించి వారిద్దరితోపాటు సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్టు చేశారు. బాధితుడి వద్ద తీసుకున్న రూ.30 వేలతోపాటు అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వద్ద అదనంగా రూ.37,300 ఉండడంతో ఆ మొత్తాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ మోహన్‌తోపాటు సీఐలు జీఎల్ శ్రీనివాసరావు, కిరణ్, అంజనేయరెడ్డి, ఏఎస్సై సురేష్ పాల్గొన్నారు.



ఫిర్యాది రాజ్‌కుమార్

డబ్బుల కోసం పీడించారు
– బుధవరపు రాజ్‌కుమార్, ఫిర్యాదుదారు

నాకు సంబంధించిన రెండు ప్లాట్‌లకు 2020లో అన్ని అనుమతులతో రిజిస్ట్రేషన్ జరిగింది. వాటి అమ్మకం, కొనుగోలుకు కోవూరు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను సంప్రదించాను. నా ప్లాట్‌లకు అప్రూవల్ లేదని రూ.40 వేలు ఇస్తే పనిచేస్తానని తెలిపారు. ఈ విషయం కార్యాలయం బయట ఉన్న డాక్యుమెంట్ రైటర్ వల్లెపు రామును సంప్రదించాలని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. తదుపరి రామును సంప్రదించగా రూ.40 వేలు అవుతుందని తెలిపారు. అంత ఇవ్వలేనని చెప్పడంతో రూ.30 వేలకు బేరం కుదుర్చుకుని ఏసీబీ అధికారుల సూచన మేరకు రాముకు అందజేశాను.

క్లుప్తంగా

విజయవంతం కావాలని..



నెల్లూరు(బృందావనం): ఆదిత్య ఎల్–1 ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ నెల్లూరులోని భక్త వత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ ఎం.శ్రీనివాసులు చొక్కా గుండీలతో రాకెట్ నమూనాను శుక్రవారం తీర్చిదిద్దారు. నాలుగు అంగుళాల వెడల్పు, 11 అంగుళాల ఎత్తులో 158 రంగు రంగుల గుండీలను ఉపయోగించి జాతీయప తాకంతో తీర్చిదిద్దానని ఆయన వెల్లడించారు.

కనులపండువగా ఉమా మహేశ్వరుల కల్యాణం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని సీఏఎం స్కూల్ సమీపంలోని ఉమామహేశ్వర దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. తమ మొక్కులో భాగంగా 28 గ్రాముల బంగారు సరుడు, మంగళసూత్రం, తదితరాలను చెన్నైలో నివాసం ఉంటున్న నెల్లూరీయులు గుర్రం జయప్రకాష్, అరుణ దంపతులు, కుటుంబసభ్యులు కానుకగా సమర్పించారని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త బాలాజీసింగ్ తెలిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు నాగమణి, ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యూబీఐ సేవలను వినియోగించుకోండి



క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(సెంట్రల్): యూనియన్ బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని బ్యాంక్ జనరల్ మేనేజర్ జ్ఞానరంజన్ సారంగి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వ్యాపారులకు క్యూఆర్ కోడ్లను శుక్రవారం అందించారు. జనరల్ మేనేజర్ జోగారావు, మార్కెట్ కమిటీ ఏడీ అనిత పాల్గొన్నారు.

నాక్ బృందం పరిశీలన

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని నాక్ బృందం శుక్రవారం సందర్శించింది. వర్సిటీలో వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. నాక్ బృందం చైర్మన్ జి.హేమంత్‌కుమార్, సభ్యులు దేవేష్ నిగం, అనింద శ్యామ్‌చౌదరి, పరాశరఫ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులకు రేషనలైజేషన్

వీఎస్‌యూలోని అధ్యాపకుల పోస్టులను రేషనలైజేషన్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో 147 ఫ్యాకల్టీ పోస్టులను రేషనలైజేషన్ చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తద్వారా వీఎస్‌యూ, కావలి పీజీ కళాశాలలో 24 రకాల కోర్సులకు సంబంధించి 23 మంది ప్రొఫెసర్లు, 42 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 82 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు రేషనలైజేషన్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కమిషనర్, ఏఈలను దుర్భాషలాడిన వారిపై కేసు నమోదు

కావలి: మున్సిపల్ కమిషనర్, ఏఈలతో కొందరు దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కావలి టు టౌన్ సీఐ సుధాకర్ శుక్రవారం చెప్పారు. కావలికి చెందిన చెందిన ఎండ్లూరి సురేష్ అలియాస్ ఆరు, అక్కిలిగుంట ఆనంద్, దావులూరి కార్తీక్, దావులూరి మోషే, సూరిపోగు నాగేంద్ర స్థానిక కచ్చేరిమిట్ట మార్గంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న డివైడర్‌కు పోస్టర్లు అంటిస్తున్నారు. మున్సిపల్ ఏఈ శ్రీనివాసులురెడ్డి పోస్టర్లను అంటించొద్దని చెప్పడంతో అతనిపై దౌర్జన్యం చేశారు. ఏఈని పక్కకు నెట్టేసి, పోస్టర్లు అంటించారు. ఏఈ విధులకు ఆటంకం కలిగించడంతో, ఆయన తనపై అధికారి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ పోస్టర్లు అంటిస్తున్న వారిని విచారించే ప్రయత్నం చేయగా, ఆయనపై కూడా వారు దురుసుగా ప్రవర్తించారు. దీంతో ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించడం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినారని కమిషనర్ ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చెప్పారు.

సులభరీతిలో విద్యాబోధన

మనుబోలు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు సులభతరంగా అర్థమయ్యేలా బైజూస్ ద్వారా విద్యాబోధన చేస్తున్నామని కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఐటీ వింగ్ నోడల్ అధికారి సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత డిసెంబర్‌లో రాష్ట్రంలో 5,18,740 ట్యాబ్‌లను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేవిడ్, సమగ్ర శిక్ష ఏపీఓ ప్రసాద్, జిల్లా నోడల్ అధికారి కేవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధిలో రాజన్న ముద్ర

ఉదయగిరి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి ఉదయగిరితో వీడని బంధం ఉంది. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న తపనతో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి ఈ ప్రాంత అన్నదాతల హృదయాల్లో పదిలమైన స్థానం సంపాదించారు. మోడుబారిన జీవితాల్లో సాగునీటి వెలుగులు నింపేందుకు ప్రయత్నించారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని కన్నీళ్లు తుడవాలన్న తపన వైఎస్సార్‌లో కనిపించేది. ఆయన జ్ఞాపకాలు ఈ ప్రాంతవాసుల్లో నేటికీ చెక్కుచెదరలేదు.

ఉదయగిరి నియోజకవర్గానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. మేకపాటి కుటుంబంతో ఉన్న సత్సంబంధాలతో ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేశారు. బీడుబారిన భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వెలుగొండ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చేశారు. ఈ పనులు 2018 డిసెంబర్ నాటికి పూర్తి చేసి సాగునీరు అందించాలని వైఎస్సార్ సంకల్పించగా ఆయన మరణంతో పనులు నత్తనడకన సాగాయి. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పరుగులు పెడుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ లోపు ఈ ప్రాజెక్ట్ ద్వారా బీడు భూములకు నీరందించే యోచనలో పనులు జరుగుతున్నాయి. ఉదయగిరి ముఖద్వారం వద్ద ఉన్న చెరువును ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు, గండిపాళెం ప్రాజెక్ట్ నుంచి ఉదయగిరి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ ట్యాంక్ బండ్ అభివృద్ధి కోసం ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.9.5 కోట్లు ఇచ్చారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెండు, మూడు నెలల్లో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.



ఉదయగిరి ప్రజాపథంలో పాల్గొన్న వైఎస్సార్ (ఫైల్)



ఉదయగిరి ట్యాంక్ బండ్

పొగాకు రైతుల కోసం..



పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్ (ఫైల్)

ఆత్మకూరు రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల కోసం అనేక పోరాటాలు చేశారు. మర్రిపాడు మండలం డీసీపల్లి వేలం కేంద్రంలో 2004 సంవత్సరంలో పొగాకు ధరలు క్షీణించడంతో క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వైఎస్సార్ అక్కడికి వచ్చారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఆయన వేలం కేంద్రంలో ధరలు ఎందుకు దిగజారుతున్నాయంటూ పొగాకు బోర్డు అధికారులు, ప్రైవేట్ కంపెనీలను రైతుల సమక్షంలో నిలదీశారు. వైఎస్సార్ రాకతో వేలం కేంద్రంలో పొగాకు ధరలు కొంతమేర పుంజుకోవడంతో రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆనాటి కార్యక్రమంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, డాక్టర్ బి.సుందరరామిరెడ్డి, పుట్టం బ్రహ్మానందరెడ్డి, రాచాల రవికుమార్ యాదవ్ తదితరులు కూడా వైఎస్సార్ వెంట ఉన్నారు.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతు ద్రోహి

- ధ్వజమెత్తిన రెండు మండలాల రైతులు
- నక్కలకాలువ వద్ద పనుల పరిశీలన



నక్కలకాలువ వద్ద మాట్లాడుతున్న రైతులు

ముత్తుకూరు: మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతు ద్రోహిగా మారారని ముత్తుకూరు, వెంకటాచలం రైతులు ధ్వజమెత్తారు. పొట్టెంపాడు సమీపంలో నక్కలకాలువ వద్ద శుక్రవారం పెద్దసంఖ్యలో చేరిన రైతులు సోమిరెడ్డి వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి వెంకటాచలం మండల చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రైతులు పల్లంరెడ్డి జనార్దనరెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, ఆరుగుంట ప్రభాకరరెడ్డి, బందెల వెంకటసుబ్బయ్య, పోచారెడ్డి చెంగారెడ్డి, ఆలపాక శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడారు. 1992లో ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి మేజర్ డ్రెయిన్ అయిన నక్కలకాలువలో పూడికను తీయించారని గుర్తు చేశారు. అయితే 30 ఏళ్లుగా సర్వేపల్లి రాజకీయాలు చేస్తున్న సోమిరెడ్డి ఈ కాలువను పట్టించుకోనేలేదని దుయ్యబట్టారు. పూడిపోయిన ఈ డ్రెయిన్ వల్ల రెండేళ్లుగా వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో వరినార్లు మునిగిపోతున్న విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన వెంటనే స్పందించి రైతు పక్షపాతిగా జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారన్నారు. ఈ విషయం తెలియని సోమిరెడ్డి టెండర్ పిలవకుండానే పనులు చేపట్టారంటూ విష ప్రచారం చేస్తూ రైతు ద్రోహిగా మారారని విమర్శించారు. రైతులు బాగుపడడం ఆయనకు ఇష్టం లేదన్నారు. అందుకే సర్వేపల్లిలో నాలుగుసార్లు ఓటమిపాలయ్యారని ఎద్దేవా చేశారు. రూ.4.83 కోట్లతో చేపట్టిన పూడికతీసే పనులను రూ.10 కోట్లు అంటూ ఆరోపించడం దారుణమని ఘాటుగా విమర్శించారు. ఈ కాలువ పూడిక తీయడం వల్ల రెండు మండలాలకు చెందిన వందలాది రైతులకు ఎంతోమేలు చేకూరుతుందన్నారు. 2015 నవంబర్ వరదలో చంద్రబాబును నక్కలకాలువ వద్దకు తీసుకొచ్చిన సోమిరెడ్డి రైతులకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు.

షోకాజ్ నోటీసులు ఇవ్వండి

- డీపీఓ సుస్మితారెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): సమావేశానికి హాజరై హరికథలా వినకుండా చెప్పిన సమాచారాన్ని నమోదు చేసుకుని కిందిస్థాయి ఉద్యోగులకు సూచనలివ్వాలని డీపీఓ సుస్మితారెడ్డి ఈఓపీఆర్డీలను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఈఓపీఆర్డీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీపీఓ మాట్లాడారు. ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను కిందిస్థాయి సిబ్బందికి చేరవేయడంలో ఈఓపీఆర్డీలు విఫలమవుతున్నారన్నారు. ఇకపై నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి హాజరు కాని ఈఓపీఆర్డీలందరికీ షోకాజు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సంగం మండలం మినహా మిగిలిన మండలాలన్నీ వెనుకబడి ఉన్నాయన్నారు. డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇంటి పన్నులకు సంబంధించి డిజిటల్ చెల్లింపులు వందశాతం అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

నాగరాజుకు నివాళి

ఈఓపీఆర్డీ విశ్వాసం నాగరాజు ప్రమాదవశాత్తు గత నెలలో కాశీలో మృతిచెందారు. నాగరాజు సంతాప సభను జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ వెంకట్రావ్, డీపీఓ సుస్మితారెడ్డి తదితరులు నాగరాజుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు కుటుంబ సభ్యులు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

జయహే.. జగన్మాత



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



సుజాతమ్మకాలనీలోని శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో



భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో...

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

నెల్లూరు(బృందావనం): శ్రావణ మాస మూడో శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు. సామూహిక లక్ష కుంకుమార్చనను విశేషంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

➡ నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో గల అనివెట్టి మండపంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. సామూహిక లక్ష కుంకుమార్చనను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి, వేదపండితుడు అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తల మండలి సభ్యులు దొరబాబు, మోహన్‌రెడ్డి, పెంచలమ్మ, భారతి, నాగమణి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుష్పయాగాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఉభయకర్తలుగా మైథిలి, సాయికుమార్, పవన్, నిధి, సోమశేఖరశర్మ, మహేశ్వరి వ్యవహరించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

➡ సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి ఆలయంలో స్వర్ణమహాలక్ష్మి మూలవర్లు, ఉత్సవమూర్తికి అభిషేకాలు, పూజలు చేశారు. స్వర్ణమహాలక్ష్మికి సహస్రనామార్చనను నిర్వహించారు. ఉభయకర్తలుగా దోనిపర్తి గిరిప్రసాద్, వాణి దంపతులు వ్యవహరించారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు రత్నం, మస్తాన్‌రెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్‌కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారికి సామూహిక కుంకుమ, ఖడ్గమాల పూజలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పుట్టా సత్యనారాయణరావు, గిరిజ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

- ఒక్కో విభాగంలో ఒక్కొక్కరు
- ఈ నెల 5న అవార్డులు అందుకోనున్న టీచర్లు



కొండలరావు



ఫణికుమార్



లక్ష్మీభవాని

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేశారు. హెడ్‌మాస్టర్/ప్రిన్సిపల్ విభాగంలో గొలగమూడిలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డి.కొండలరావు, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో టీపీ గూడూరు మండలం చెన్నాపల్లిపాళెంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీ ఫణికుమార్, సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో కొడవలూరు మండలం కొడవలూరు ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న టి.లక్ష్మీభవానిని ఎంపిక చేశారు. వీరు ఈ నెల 5న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..

డి.కొండలరావు స్వస్థలం వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి. కాకాల్లువారిపల్లెలో 10వ తరగతి వరకు, వింజమూరులో ఇంటర్ పూర్తి చేశారు. 1989లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. 1996లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచరుగా(పీజీటీ) బాధ్యతలు చేపట్టారు. 1996 నుంచి 2006 వరకు కోటలోని ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్, 2006 నుంచి 2013 వరకు చిలమానుచేనులోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌లో ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ప్రస్తుతం గొలగమూడిలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌లో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు.

విద్యారంగంలో విశేష సేవలు

చేవూరు వెంకటఫణికుమార్ స్వస్థలం దామరమడుగు. తండ్రి వెంకసుబ్బారావు – తల్లి వర్ధనమ్మ. దామరమడుగులోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ వీఆర్ కళాశాలలో అభ్యసించారు. ఎమ్మెస్సీ ఎస్వీ యూనివర్సిటీలో చదివారు. 1997లో ఎస్జీటీగా తడ మండలం గ్రద్దగుంటలో, అనంతరం బోగోలు మండలం ఏపీకండ్రిగ, వెంకటాచలం మండలం పలుకూరివారిపాళెంలో పనిచేశారు. 2003 నుంచి 2006 వరకు మండల, జిల్లా రిసోర్స్‌పర్సన్‌గా పనిచేశారు. 2009లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. 2017 వరకు పొదలకూరు మండలంలో ఎస్ఏగా పనిచేశారు. ప్రస్తుతం తోటపల్లిగూడూరు మండలం చెన్నపల్లిపాళెం హైస్కూల్‌లో పనిచేస్తున్నారు. 2015లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2020 జనవరి 26న విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకున్నారు. చెన్నపల్లిపాళెంలోని పాఠశాలలో రూ.2 లక్షల సొంత నిధులతో సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో అప్పట్లో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

చదువుల తోట

తోట లక్ష్మీభవాని స్వస్థలం ఒంగోలు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ వరకు ఒంగోలులో చదివారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బాటనీ, పద్మావతి యూనివర్సిటీలో బీఈడీ, పెరియార్ యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు. 1995లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఒంగోలులోని అమ్మనబ్రోలు ప్రాథమిక పాఠశాలలో 2001 వరకు పనిచేశారు. అనంతరం అంతర్ జిల్లా బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్త వంగల్లులోని హైస్కూల్‌లో విధులు చేపట్టారు. 2002 నుంచి కొడవలూరు మండలం రామనాథపురం, హరిజనవాడ పాఠశాలల్లో పనిచేశారు. మండల, జిల్లా, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఎస్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు, పునాది వర్క్‌బుక్స్, బోధనా అభ్యసన పుస్తకాల రూపకల్పనలో ప్రముఖపాత్ర పోషించారు. 2016లో మండలస్థాయి, 2019లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

రాష్ట్రంలో జగనన్న పారదర్శక పాలన

- మేకపాటి రాజారెడ్డి



బుక్‌లెట్ అందిస్తున్న రాజారెడ్డి

కొండాపురం: రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా స్వచ్ఛమైన జగనన్న పారదర్శక పాలన కొనసాగుతోందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఇస్కదామెర్లలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో రాజారెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీలు, పక్కాఇళ్లు, అమ్మఒడి, ఆర్థిక భరోసా, రైతు భరోసా, సామాజిక పింఛన్లు, తదితర పథకాలతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలను గ్రామాల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్న చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోతారని జోస్యం చెప్పారు. రానున్న రోజుల్లో టీడీపీకి జనాగ్రహం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, గరిమెనపెంట సొసైటీ డైరెక్టర్ పిన్నిక కొండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు యరగల నారాయణరెడ్డి, బొడ్డు మల్లికార్జున, పి.కమలాకర్, మోహన్, నారాయణరెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.

కుటుంబసభ్యులు మాట్లాడడం లేదని..

- ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



రమణయ్య మృతదేహం

నెల్లూరు(క్రైమ్): కుటుంబసభ్యులు మాట్లాడడం లేదని మనస్తాపానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని శివగిరికాలనీ ఏడో వీధిలో రమణయ్య (41), వెంకటమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమణయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలిద్దరికీ వివాహం చేశారు. రమణయ్య మద్యం తాగేవాడు. ఈ విషయమై దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. పలుమార్లు మద్యం తాగడం మానమని భార్య సూచించినా అతను పట్టించుకోలేదు. దీంతో ఇటీవల రమణయ్యతో కుటుంబసభ్యులు మాట్లాడడం మానేశారు. మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు అతడిని కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్

కావలి: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ చెప్పారు. తన కార్యాలయంలో వైద్య శాఖ అధికారులతో కలిసి వాల్ పోస్టర్లను శుక్రవారం ఆర్డీఓ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 0–5 సంవత్సరాల బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేస్తుందన్నారు. దీనిని ఉల్లంఘించిన వారికి మూడేళ్ల జైలు, రూ.10,000 జరిమానా విధించబడుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలను జరిపి వివరాలు వెల్లడించమని కోరిన వారికి, పరీక్షలు చేసి వివరాలు వెల్లడించిన వైద్యులకు మొదటి తప్పునకు 3 ఏళ్ల జైలు, రూ.50,000 జరిమానా అని హెచ్చరించారు.

వైభవంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ

నెల్లూరు(బృందావనం): నగరంలో ఈ నెల 19 నుంచి 23 వరకు వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నేతలు కోరారు. గణేశ్ విగ్రహాల మండపాల నిర్వాహకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని శ్రీనివాసాగ్రహారంలోని ఓ కన్వెన్షన్ హాల్లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల ఉత్సవ నిర్వాహకులు, కమిటీలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని టీవీఎస్ కల్యాణ సదన్‌లో ప్రారంభించనున్నామని తెలిపారు. ఉత్సవ మండపాలకు అనుమతులను సింగిల్ విండో విధానంలో మంజూరు చేయాలని కోరారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనాన్ని సెప్టెంబర్ 23న చేపట్టాలని, దీనికి అందరూ కలిసిరావాలని పేర్కొన్నారు. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కోశాధికారి మోహన్‌రావు, సభ్యులు కొండపల్లి శ్రీకాంత్, కృష్ణారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, శివకుమార్‌ఆచారి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251	▲	4
వెండి (కేజీ)	74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.01	106.40
€	యూరో	ఎస్‌బీఐ	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.21	62.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా–విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా–విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.


ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016–2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!



న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్–ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహీన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు ధైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4–1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్–30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–1, 7–6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6–2, 6–2, 6–7 (6/8), 6–2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 6–1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6–3, 6–2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3–6, 4–6, 7–6 (7/3), 6–4, 7–6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3–6, 5–7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7–6 (7/4), 3–6, 2–6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**



కుమారుడితో ఇస్నర్